గతంలోని తప్పులను సరిదిద్దుతున్నాం

- రాష్ట్రాన్ని గాడిలో పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది
- 2047 నాటికి అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ
- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"పాలనంటే నల్లేరు మీద నడక కాదు. గతంలోని తప్పులను సరిదిద్దుతున్నాం. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రజల ఆకాంక్షలే మా ప్రభుత్వ ఎజెండా. 2047 నాటికి అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టాలి. జీడీపీలో పది శాతం వాటా... మూడు ట్రిలియన్ల ఎకానమీ సాధించడమే మా ప్రభుత్వ లక్ష్యం..." అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ రైజింగ్ పేరుతో విజన్ డాక్యుమెంట్ను తీసుకొచ్చి రంగాల వారీగా విధానాలను ప్రకటిస్తున్న విషయాలను ఆయన గుర్తుచేశారు. రాష్ట్రాన్ని ఆదర్శ రాజకీయాలకు, అభివృద్ధికి మార్గదర్శకంగా నడుపుతున్నామని తెలిపారు. అలాంటి గొప్ప లక్ష్యం కోసం అందరూ ఒక్కటిగా ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సోమవారం సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పరేడ్ గ్రౌండ్ లోని సైనిక అమరవీరుల స్మారకం వద్ద ఆయన నివాళి అర్పించారు. అక్కడున్న సందర్శకుల పుస్తకంలో ఆయన సంతకం చేశారు. వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రికి సిఎస్ రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్ స్వాగతం పలికారు. అనంతరం సిఎం ఓపెన్ టాప్ జీపులో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 19 మంది పోలీస్ సిబ్బందికి మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి రాష్ట్రపతి మెడల్స్, 11 మందికి మెడల్స్ను అందజేశారు. తొమ్మిది మంది ప్రముఖులు, వారి కుటుంబ సభ్యులకు రూ.ఒక కోటి చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా జపాన్లోని కితాక్యూషు సిటీ మేయర్ కజుహిసా టకేచీ హాజరయ్యారు. వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు, సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు గడిచినా ఆకాంక్షలు నెరవేరక ప్రజలు ఆవేదనలో తిరస్కరించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే క్రమంలో అప్పటికే అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థ, నిర్వీర్యమైన వ్యవస్థల్లో జరిగిన తప్పులను సరిదిద్ది రాష్ట్రాన్ని గాడిన పెట్టడం బాధ్యతగా స్వీకరించినట్టు తెలిపారు. జనం ఆశల ప్రజా ప్రభుత్వ ఎజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తూ ముందుకు కదులుతున్నామన్నారు. ప్రజల ఆలోచనే తమ ఆచరణ అని

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

సిఎం స్పష్టం చేశారు. యూనివర్సిటీల వీసీల నియామకం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన, పోటీ పరీక్షల నిర్వహణ, విద్యా కమిషన్, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు, సమాచార కమిషనర్లు, లోకాయుక్త, హెచ్ఆర్సి సభ్యులను నియమించడం, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని సిఎం తెలిపారు. "ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీని ఆవిష్కరించుకున్నాం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తొలి ఏడాదిలోనే రూ.21 వేల కోట్లు సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించే పనులను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించాం. మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయించాం. పెట్రోల్ బంకులు, పాఠశాలల నిర్వహణ, యూనిఫాం కుట్టుపనితో పాటు మహిళా శక్తి క్యాంటీన్లను నిర్వహించేలా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. తాము తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు అంతర్జాతీయ మార్కెట్తో మహిళా సంఘాలు పోటీ పడేలా హైటెక్ సిటీ పక్కన శిల్పారామంలో వంద ఇందిరా మహిళా శక్తి స్టాళ్లను ఏర్పాటు చేశాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆ బస్సులకు వారిని యజమానులను మార్చేందుకు వీలుగా మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసికి అద్దెకు ఇప్పిస్తున్నాం. ఇప్పటికే 150 బస్సులను వారికి అందజేశామని, మిగిలిన 450 బస్సులను త్వరలో అందజేస్తాం. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నాం..." అని తెలిపారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు క్యూఆర్ కోడ్తో కూడిన ప్రత్యేక కార్డులు అందజేసి, వారికి ప్రతి సంవత్సరం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ వివరాలతో పాటు పూర్తి వివరాలను ఆ కార్డులో పొందుపరచనున్నట్టు ప్రకటించారు.

8 నెలలో 25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్లు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. రూ.15,333 కోట్లతో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం ఎకరాకు రూ.12 వేలకు పెంపు, భూమి లేని వ్యవసాయ కార్మికుల కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్తో రైతులకు అదనపు ఆదాయంతో రాష్ట్రంలో సన్న ధాన్యం దిగుబడి భారీగా పెరిగిందని సిఎం హర్షం వ్యక్తం చేశారు. దీంతో 275 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్గా నిలిచిందని వెల్లడించారు. భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూ భారతి-2025 చట్టాన్ని తెచ్చామనీ, భూహక్కుల రికార్డులు పక్కాగా నిర్వహించి, భూ యజమానులకు భరోసా కల్పిస్తున్నట్టు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే 60 వేలకుపైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి, నియామక పత్రాలను అందించినట్టు సిఎం తెలిపారు. డిఎస్సి ద్వారా 10 వేల మందికి పైగా ఉపాధ్యాయులను నియామకాలతో పాటు,. అంతర్జాతీయ పెట్టుబడులు రావడంతో ప్రయివేటు రంగంలో లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు వివరించారు. అన్ని రంగాల ఖాళీల భర్తీతో నిరుద్యోగ యువతకు భరోసా కల్పించామన్నారు. సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఒక్కొక్కరికి రూ.ఒక లక్ష చొప్పున ఆర్థిక సాయం, యువతకు నైపుణ్య శిక్షణ కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామనీ, ఒలంపిక్స్లో పతకాల సాధనే లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పబోతున్నట్టు వెల్లడించారు.

మెరుగైన విద్యావ్యవస్థ ఏర్పాటు కోసం విద్యా కమిషన్ సమగ్ర విధానాన్ని రూపొందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్ విధానం తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టల్స్లో డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో చదువుకునేలా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణంలో భాగంగా, తొలి దశలో రూ.11,600 కోట్లను వెచ్చిస్తున్నట్టు తెలిపారు. 30 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలను నిర్మిస్తున్నామనీ, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.పది లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు.

కులగణనతో దేశానికి ఆదర్శంగా నిలిచామని, రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం కూడా జనగణనతో పాటు కులగణన చేయనున్నట్టు ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి బీసీలు 56.36 శాతం తేల్చినట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇప్పటికే శాసనసభ, శాసనమండలిలో బిల్లు ఆమోదం పొందిన విషయాన్ని గుర్తుచేశారు. ఎస్సీల ఉప కులాల వర్గీకరణపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామనీ, మూడు గ్రూపులుగా విభజించి చట్టబద్దత కల్పించినట్టు తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదల కోసం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేసి, రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లను నిర్మించబోతున్నట్టు తెలిపారు. మే 20 నాటికి 5,364 మంది లబ్దిదారులకు 53.64 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీతో విప్లవాత్మకమైన మార్పు తెచ్చామన్నారు.

దావోస్, సింగపూర్,జపాన్ లాంటి దేశాల్లో పర్యటించి రూ.3 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని సిఎం ప్రకటించారు. ఐటీ దిగ్గజాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, హెచ్సిఎల్, కాగ్నిజెంట్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్లో తమ సంస్థలను విస్తరిస్తున్నాయన్నారు. మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును చేపడుతున్నామని, బాపూఘాట్ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్టు తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసేందుకు వీలుగా ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసినట్టు సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు అన్ని అనుమతులు సాధించామనీ, హైదరాబాద్ నగర అభివృద్ధి లక్ష్యంగా దాదాపు రూ.18 వేల కోట్తో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. రూ.24 వేల కోట్లతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును చేపట్టబోతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖను మరింత పటిష్టపరిచాం. డ్రగ్స్పై ఉక్కు పాదం మోపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025 ప్రకారం దేశంలోనే తెలంగాణ పోలీస్ నెంబర్ వన్గా నిలిచిందని, హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగానికి దుబాయ్లో అంతర్జాతీయ అవార్డు లభించిందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. భారత్ సమ్మిట్ కార్యక్రమంతో హైదరాబాద్ ను అంతర్జాతీయ వేదికగా మార్చినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్రంలో చారిత్రక, పర్యాటక ప్రదేశాలను సందర్శించి ప్రపంచ నలుదిశగా చాటారని చెప్పారు.

రాష్ట్ర ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి

- ఎన్నో కలలు కని ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం
- హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలకనుగుణంగా అందరం కలిసి పని చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ఎన్నో కలలు గని ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని, ఆ కలలు సాకారం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. సోమవారం హైదరాబాద్లోని హైడ్రా కార్యాలయం ముందు జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఔటర్ రింగు రోడ్డు వరకూ పరిధిని నిర్దేశించి హైడ్రాను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను పరిరక్షించడంతోపాటు, ప్రకృతి వైపరీత్యాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలకు అండగా ఉండేలా పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందన్నారు. ఆ దిశగా అందరూ కలసి పని చేయాలని సూచించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారని, రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర గీతం చాటి చెబుతోందని తెలిపారు. ఆ లక్ష్యాలు నెరవేరేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలన్నారు.

జాతీయ జెండాకు వందనం చేస్తున్న హైడ్రా కమిషనర్

గురుకులాల్లో అద్దె భవనాల సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గురుకులాల్లో అద్దె భవనాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులతో పనులు చేయించడం దుర్మార్గమని తెలిపారు. గచ్చిబౌలి, చిలుకూరులో 95 శాతం మార్కుల నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 240 గురుకులాల్లో 1200 మంది అసిస్టెంట్ కేర్టేకర్ పోస్టులను తొలగించి పిల్లలతో బాత్రూంలు, తరగతి గదులు, విద్యా సంస్థ ఆవరణలను శుభ్రం చేయించాలని నిర్ణయించడం తగదని హితవు పలికారు. గతంలో గురుకులాల మెయింటెనెన్స్, స్వీపింగ్, శానిటేషన్ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించేదనీ, ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిలిపేసిందని పేర్కొన్నారు. తగిన నిధులు కేటాయించి విద్యార్థులకు చదువుపై కేంద్రీకరించేటట్టు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బాధ్యతాయుత స్థానాల్లో పనిచేస్తూ గురుకులాల్లో చదివే విద్యార్థులు గురించి అనుచితంగా మాట్లాడటం తగదనీ, అలా వ్యవహరించిన గురుకుల కార్యదర్శి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం గౌలిదొడ్డి, చిలుకూరు లాంటి ప్రతిష్టాత్మక (సిఒఇఎస్) గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఎలాంటి సర్క్యులర్ జారీ చేయకుండానే ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులకు 95 శాతం మార్కులు వస్తేనే ఆ గురుకులాల్లో కొనసాగించాలనీ, లేదంటే వారిని సాధారణ గురుకుల్లోకి పంపాలని ఆదేశాలివ్వడం సరికాదని తెలిపారు. 12 గురుకులాలను మూసేశారనీ, దీంతో 11,520 మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నతచదవులకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 662 గురుకులాల భవనాలకు రూ.215 కోట్లు అద్దె చెల్లించకుండా బకాయి ఉండడంతో భవన యజమాన్యాలు తాళాలేసుకున్నారని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకల్లో నారాయణ

పదేళ్లు ఫామ్హౌస్లోనే..

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపట్ల గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందనీ, పదేండ్లు ఫామ్హౌస్కే పరిమితమైన ఆయన ప్రజల ఆకాంక్షలు పట్టించుకోలేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. సోమవారం హైదరాబాద్లోని మఖ్దూం భవన్లో తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాతో పాటు, సిపిఐ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కోసం మొట్టమొదటగా నిర్ణయం తీసుకున్న పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు. అయితే.. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ప్రజల ఆకాంక్షలకు నీళ్లొదలారని దుయ్యబట్టారు. ప్రజా ఉద్యమాలను పట్టించుకోలేదని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారనీ, అప్రజాస్వామిక విధానాలను అమలు చేశారని విమర్శించారు. దీంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరగడం మూలంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆ పార్టీ కూడా ప్రజలకు చాలా వాగ్దానాలు చేసిందన్నారు. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత రేవంత్ సర్కారుదేనని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పల్లా వెంకటరెడ్డి, కె శ్రీనివాస్రెడ్డి, ఇటి నర్సింహా తదితరులు మాట్లాడారు. అంతకు ముందు గన్ఫౌండ్రీలోని అమర వీరుల స్థూపం వద్ద తెలంగాణ అమర వీరులకు సీపీఐ నేతలు నివాళులర్పించారు..

శాసనసభ ఆవరణలో రాష్ట్ర అవతరణ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ .అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి నరసింహా చార్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల విందుగా లిటిల్ స్టెప్స్ మారథాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజసేవా స్ఫూర్తిని చాటుతూ వివైబ్, అహంప్రాన ఫౌండేషన్తో కలిసి 5-12 సంవత్సరాల పిల్లల కోసం "లిటిల్ స్టెప్స్ బిగ్ డ్రీమ్స్" మారథాన్ను విజయవంతంగా నిర్వహించింది. "అందరికీ విద్య" అనే లక్ష్యంతో నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి రిజిస్ట్రేషన్కు ఒక పాఠశాల బ్యాగును ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మారథాన్లో 900 మందికి పైగా చిన్నారులు,వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.

సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా కృషి

- 9,326 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు
- 'మా పాప - మా ఇంటి మణి దీపం' పై జిల్లా కలెక్టర్కు అభినందన
- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రజా పాలన అందిస్తున్నామని, ఎస్సి వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ -2047 విజన్తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఖమ్మంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు భట్టి విక్రమార్క హాజరై జెండా ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక పాలన లక్ష్యాలుగా తెలంగాణ రైజింగ్ -2047 విజన్ పాలసీ రూపొందించామన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్, టూరిజం

పాలసీలను సిద్ధం చేసిందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణహిత ఇంధనాన్ని అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025ను రూపొందించిందని, ఇందులో భాగంగా 2030 నాటికి 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి, గ్రూప్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించామన్నారు. జిల్లాలో 9,326 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసిందన్నారు. మధిర నియోజకవర్గంలో మహిళల ఆర్థిక సాధికారతను పెంచేందుకు ఇందిరామహిళా డెయిరీ ప్రాజెక్ట్ చేపట్టామన్నారు. దీనిలో భాగంగా 21 వేల మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు రెండు పాడి గేదెలను ఇచ్చామన్నారు. ఈ డెయిరీ ద్వారా వచ్చే లాభాలనూ సంఘ సభ్యులకు జమ చేస్తామని తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్లో 229 కోట్లతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వుయ్ కెన్ లెర్న్ ద్వారా ఆంగ్ల నైపుణ్యాల పెంపునకు కృషి చేశామని, గతేడాది 34 ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వచ్చే సంవత్సరం అన్ని ప్రభుత్వం స్కూళ్లలో చేపట్టనున్నట్టు తెలిపారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా రూ. 100 కోట్లతో నిర్మించిన రాజీవ్ కెనాల్ను వినియోగించి లక్షా 25 వేల ఎకరాలను స్థిరీకరించామన్నారు. పాలేరు లింక్, సత్తుపల్లి యాతాలకుంట ట్రంక్ కెనాల్ పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. భూ యాజమాన్య హక్కులు పరి రక్షించడానికి భూ భారతి చట్టాన్ని ఏప్రిల్ 14, 2025న ప్రవేశ పెట్టిందని, ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలం రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 3,224 దరఖాస్తులను స్వీకరించి సమస్యలను పరిష్కరించామన్నారు. మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలాన్ని రెండవ పైలట్ మండలంగా ఎంపిక చేశామన్నారు. "మా పాప- మా ఇంటి మణిదీపం" అనే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ను అభినందించారు. మున్నేరు నదిపై రూ.180 కోట్లతో తీగల వంతెన నిర్మాణం పురోగతిలో ఉందని తెలిపారు. ఖిలా రోప్ వే, పాలేరు లేక్ పార్క్, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం, ఇతర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అనంతరం అమర వీరుల కుటుంబ సభ్యులను డిప్యూటీ సిఎం సన్మానించారు.

రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్

- జపాన్ "కితాక్యూషు సిటీ" స్ఫూర్తితో అభివృద్ధి
- ఏడాదిన్నరలో తెలంగాణకు రూ. 2లక్షల కోట్ల పెట్టుబడులు
- మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్దే లక్ష్యంగా జపాన్లోని "కితాక్యూషు సిటీ" స్ఫూర్తితో రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్ను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. తెలంగాణ, కితాక్యూషు నగరం మధ్య కుదిరిన పరస్పర సహకార ఒప్పందం ఇందుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సోమవారం టీహబ్ లో "ఫ్రం కితాక్యూషు టూ తెలంగాణ: కేటలైసింగ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ గ్రోత్ అనే అంశంపై సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "తెలంగాణ రైజింగ్ 2047" అనే లక్ష్యంతో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి సుమారు రూ. మూడు లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు మా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్ లాంటి అనేక అంతర్జాతీయ స్థాయి కంపెనీలు హైదరాబాద్లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జపాన్ కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన 50 మంది యువతకు జపాన్ లో ఉపాధి అవకాశాలు లభించాయని, మరింత మందికి దక్కేలా టాంకాం లాంటి ప్రభుత్వ సంస్థల ద్వారా జపనీస్ భాషను నేర్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా తీర్చి దిద్దేందుకు ఇండస్ట్రియల్ జోన్స్ ఏర్పాటు, జీరో వేస్ట్ డిజైన్, అత్యాధునిక వాటర్ అండ్ వేస్ట్ మేనేజ్మెంట్ పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. తెలంగాణ, కితాక్యూషు నగరం మధ్య సత్సంబంధాలు మరింత పెరిగేలా హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సర్వీసులను నడిపేందుకు గల సాధ్య సాధ్యాలపై అధ్యయనం చేయిస్తామన్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా జపాన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, కితాక్యూషు నగర మేయర్ కజుహిసా టకేచీ, టిజిఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, టిజిఐఐసి సిఇఒ మధుసూదన్, రాష్ట్ర ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ సెల్ డైరెక్టర్ అవినాష్, సిఐఐ తెలంగాణ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని సరైన బాటలో నడిపేదే కవిత్వం

- రాజీవ్ గాంధీకి తెలంగాణతో ఏం సంబంధం..
- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కవిత

తెలంగాణ ఉద్యమ కాలంలో యువత ఆత్మ బలిదానాలను కవులు వారి కవితల ద్వారా చెప్పేవారని, సమాజాన్ని సరైన బాటలో నడిపేదే కవిత్వం అని, భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం మన నీళ్లు, వనరుల రక్షణపై కవిత్వం రావాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. జూన్ 2న తెలంగాణ యువకుల కోసం రాజీవ్ గాంధీ యువ వికాస్ పెడతామని ముఖ్యమంత్రి ప్రకటించారని, రాజీవ్ గాంధీకి తెలంగాణతో ఏం సంబంధం ఉందని తాము ప్రశ్నించామని తెలిపారు. తెలంగాణ అమరవీరుల పేరు పెట్టాలని తాము ప్రతిపాదించామని, ఇప్పుడు ఆ కార్యక్రమాన్ని వాయిదా వేశారని, ఇది జాగృతి విజయం అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన శ్రీకాంతా చారి, యాదిరెడ్డి సువర్ణ పేర్లు పెట్టారని ఆమె సూచించారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ జాగతి ఆధ్వర్యంలో హైదరాబాద్లోని తెలంగాణ సారస్వత పరిషత్లో 'తెలంగాణ యువ కెరటాలు' పేరిట యువ కవుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తాను గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలానే ప్రశ్నించానని, ప్రజల పక్షాన ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. చిన్న పిల్లలు బతుకమ్మ పాటలు నేర్చుకుంటే బతుకమ్మ వందేండ్లు బతికి ఉంటదని, యువ కవులు కవితలు రాస్తే తెలంగాణ సాహిత్యం వందేండ్లు బతికి ఉంటదని అన్నారు. తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ చారి పుట్టిన రోజు, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఒకే రోజు కావడం సంతోషకరమన్నారు. సాహిత్యం, సంస్కృతి వర్ధిల్లిన నేల బాగుంటుందని తెలిపారు. 35 ఏళ్లలోపు వయసున్న యువ కవులు అన్ని భాషల్లో కవిత్వం రాయాలనే ఆకాంక్షతో ఈ కవి సమ్మేళనం నిర్వహించినట్టు చెప్పారు. తెలంగాణ బిడ్డలకు ధిక్కారం ఎలా ఉంటుందో మమకారం కూడా అంతే ఉంటుందన్నారు. కవులు ఏ పాలకుడి ముందు కూడా తలవంచకూడదన్నారు. పాలనలో లోపాలను ఎత్తి చూపాల్సిందేనని అన్నారు. నిర్భయంగా చెప్పేవాడే నిజమైన కవి అని అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో యువత ఆత్మ బలిదానాలను కవులు వారి కవితల ద్వారా చెప్పేవారని, భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం మన నీళ్లు, వనరుల రక్షణపై కవిత్వం రావాలన్నారు. సమాజాన్ని సరైన బాటలో నడిపేదే కవిత్వం అని, తెలంగాణలో ఎన్నో కార్యక్రమాలు జాగృతి ఆధ్వర్యంలో చేయాల్సి ఉందని, దానికి మీ సహకారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాలేశ్వరం శంకరం, చమన్, గొల్ల శివశంకర్, రమేష్ నాయక్, పాల్గొన్నారు.

హైదరాబాద్లో టిబి ముక్త్ భారత్ అభియాన్ ఆరంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్' పథకాన్ని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి సోమవారం అధికారికంగా ప్రారంభించారు. సోమవారం జాతీయ టిబి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన ఈ పథకం.. 2030 సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్డిజి) కంటే ఐదేళ్ల ముందు 2025 నాటికి భారతదేశాన్ని టిబి రహితంగా మార్చే లక్ష్యంతో దీన్ని రూపొందించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్లోని హమాలీ బస్తీ టిబి యూనిట్లో జరిగిన కార్యక్రమంలో వెంకటి మాట్లాడుతూ.. హైదరాబాద్లో నవీన రోగ నిర్ధారణ, సమాజ మద్దతు, అవగాహనా కార్యక్రమాల ద్వారా టిబిని నిర్మూలన చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. టిబి లక్షణాలను ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స, ప్రాణాలను కాపాడటం కీలకమని అన్నారు. 'నీ-క్షయ్' పోర్టల్ ద్వారా టిబి రోగుల రియల్ టైమ్ ట్రాకింగ్, చికిత్స పర్యవేక్షణను అప్డేట్ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ఇంటింటి స్క్రీనింగ్, మొబైల్ హెల్త్ యూనిట్ల టిబి చురుకైన కేసు గుర్తింపు చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు నీ-క్షయ్ మిత్రులుగా చేరి టిబి రహిత హైదరాబాద్లో భాగస్వామ్యం కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం, లక్షణాలను నివేదించడానికి టిబి హెల్ప్ లైన్ నెంబర్ 1800-11-6666 లేదా ఎఒఐఅ- ఎఋఖ.ప్త్రశీజ.ఱఅ వెబ్సైట్ను సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ చల్లాదేవి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, ఎస్పీహెచ్ఓ డాక్టర్ సాయిబాబు, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మహేశ్, టిబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరిత, యూపీహెచ్సీ, బస్తీ దవాఖానల మెడికల్ ఆఫీసర్లు, రాష్ట్రీయ బాల సరస్వతి కార్యక్రమం బృందం, సికింద్రాబాద్, లాలాపేట టిబి యూనిట్ బృందాలు, తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగ రద్దుకు బిజెపి కుట్రలు

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి బిజెపి కుట్రలు, కుతంత్రాలు చేస్తుందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్‌బాబు విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద ఎజెండాను అమలు చేయడం ద్వారా దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కులవివక్ష అంటరానితనాన్ని రూపుమాపడానికి, సామాజిక న్యాయ సాధన కోసం భవిష్యత్తు సామాజిక ఉద్యమాల నిర్మాణం కోసం సుశక్తులైన కార్యకర్తలుగా తీర్చిదిద్దడానికి జులై 12, 13, 14వ తేదీల్లో సూర్యాపేటలో మూడు రోజులపాటు నిర్వహించనున్న తెలిపారు. దేశంలో బిజెపి 11 ఏళ్ల పరిపాలన విధానం దళితుల జీవితాన్ని మరింత దుర్భరంలోకి నెట్టేసిందన్నారు. 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నామని ప్రధానమంత్రి నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని చెప్పారు. దేశంలో దారిద్ర్యం పెరుగుతుందని, మరోవైపున అదాని, అంబాని ఆస్తులు ఆకాశం ఎత్తుకు పెరుగుతున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో దళితులపై 300 రెట్లు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై మూక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడం ద్వారా రిజర్వేషన్లకు మంగళం పాడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏడాదికిపైగా గడిచినప్పటికీ దళితులకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. రాజీవ్ యువవికాస పథకం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కాంగ్రెస్ అనుయాయులకే కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. అర్హులైన లబ్దిదారులను రాజకీయాలకతీతంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి దళిత విద్యార్థినీ విద్యార్థులను కించపరిచే విధంగా మాట్లాడారని, ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఎంపిక చేయబడిన 300 మంది కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్న ఈ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో పూలే, అంబేద్కర్ ఆశయాలు కులసమస్య పరిష్కార మార్గాలు, దోపిడీ మూలాలు, మతోన్మాదం ప్రతిఘటనా పద్ధతులు వంటి అనేక అంశాలపై బోధించనున్నట్టు తెలిపారు. ఈ తరగతుల జయప్రదానికి జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, మాల మహానాడు జిల్లా నాయకులు, న్యాయవాది ఏడిండ్ల అశోక్, తెలంగాణ ప్రయివేట్ లెక్చరర్స్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె నరసింహారావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు తక్కెళ్ళపల్లి శ్యామ్, దుర్గారావు, ఇరుగు రమణ, జంగపల్లి శ్రీనివాస్, నందిపాటి శేఖర్, యాతకుల వెంకన్న, పడిశాల నాగరాజు, ములకలపల్లి మహేష్, విఘ్నేశ్వరీ, సైదమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొరకరాని కొయ్యగా రాజాసింగ్

- స్టేట్ వర్క్‌షాపునకు డుమ్మా
- బిజెపి రాష్ట్ర నేతలపై డైరెక్ట్ అటాక్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
కరమంటే కప్పకు కోపం...విడమంటే పాముకు కోపం అన్నట్టుగా బిజెపి తెలంగాణ నేతల పంచాయతీ జాతీయ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. కిషన్‌రెడ్డి, రాజాసింగ్ మధ్య జరుగుతున్న అంతర్గతపోరు తారాస్థాయికి చేరుకున్నట్టు కనిపిస్తున్నది. రాష్ట్ర నాయకత్వానికి ఎమ్మెల్యే, అసంతృప్త నేత రాజాసింగ్ కొరకరాని కొయ్యగా మారినట్టు బిజెపి శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. కవిత కామెంట్లు...రాజాసింగ్ సమర్థన వ్యాఖ్యలు...ఇప్పుడు బిజెపిలోని లుకలుకలను మరోమారు బహిర్గతం చేశాయి. ఇదిలా ఉండగానే రాష్ట్రంలో రానున్న కాలానికి సంబంధించి కార్యాచరణ, అనుసరించాల్సిన వ్యూహాలను రూపొందించడంపై జరిగిన కీలకమైన వర్క్‌షాపునకు రాజాసింగ్ ఉద్దేశపూర్వకంగా డుమ్మా కొట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. వర్క్‌షాపు సందర్భంగానూ ఇదే అంశంపై మీడియా ఫోకస్ పెట్టగా స్పందించేందుకు బిజెపి సీనియర్ నేతలు నిరాకరించారు. అయితే, ఇటీవల 'కవిత చెప్పింది నిజమే. పెద్ద ప్యాకేజీ ఇస్తే మా వాళ్లు కూడా బిఆర్‌ఎస్‌లో కలిసిపోతారు. తమ పార్టీ నుంచి నేతలు ఎక్కడ నుంచి నిలబడతారో కూడా వాళ్లే నిర్ధారిస్తారు. అధికారంలోకి వస్తారు అనే చర్చ నడుస్తున్న క్రమంలో అధ్యక్ష మార్పు అందులో భాగమే. ప్రతి ఎన్నికల్లోనూ మా నేతలు కుమ్మక్కు అయ్యారు. ప్రతి కార్యకర్తలోనూ ఇదే అభిప్రాయం ఉంది. ఎవరైనా మాట్లాడితే తొక్కిపడేస్తారు..సస్పెండ్ చేస్తారు..అనే భయంతో గమ్మున ఉంటున్నారు' అంటూ బహిరంగంగానే రాజాసింగ్ ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. కవిత కామెంట్లపై కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి 'నోరు జారొద్దు' అంటూ హెచ్చరికలు జారీ చేసినా రాజాసింగ్ ధిక్కరించడం ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నది. ఇటీవల దీనిపై జాతీయ నాయకత్వం సూచనలతో ఎమ్మెల్యేలు, ఎంపీలతో కిషన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులోనూ రాజాసింగ్ పాల్గొనలేదని విశ్వసనీయ సమాచారం. ఆ కాన్ఫరెన్స్‌లో కిషన్‌రెడ్డి..పేర్లు ప్రస్తావించకుండా పలువురు నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బిజెపిలో జరుగుతున్న వరుస ఘటనలు పార్టీ ముఖ్య నేతల మధ్య ఉన్న గొడవలను ఎత్తిచూపుతున్నాయి. మరోవైపు వరుసగా బిజెపి కీలక సమావేశాలకు డుమ్మాలు కొట్టడం, ఎల్పీ సమావేశానికి హాజరుకాకపోవడం, పదేపదే ప్రకటనల ద్వారా పార్టీని ఇరుకునబెట్టడం వంటి చర్యలతో రాజాసింగ్‌పై కిషన్‌రెడ్డి గుర్రుగా ఉన్నట్టు ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర అధిష్టానం రాజాసింగ్‌కు నోటీసులు ఇవ్వబోతున్నదనే ప్రచారం సైతం జరుగుతున్నది. దీనిపై తన సన్నిహితులు, కొందరు మీడియా ప్రతినిధుల వద్ద రాజాసింగ్ స్పందిస్తూ...'నోటీసు కాదు సస్పెండ్ చేయండి. ..... తో కలిసి పార్టీని స్ట్రాంగ్ చేయలేము. ధర్మ కార్యక్రమాలు చేయలేము. గవర్నమెంట్‌ను తీసుకురాలేము. ఒకవేళ నన్ను సస్పెండ్ చేస్తే ఎవరి వల్ల పార్టీ నష్టం జరుగుతున్నదనే విషయంపై నిజం చెప్పి, నేతల జాతకం ప్రజలందరి ముందు పెట్టి వెళ్తాను' అని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. జాతీయ స్థాయి నేతల ఆశీస్సులు పుష్కలంగా ఉండటం వల్లనే రాజాసింగ్ రాష్ట్ర నేతలెవ్వరినీ లెక్కచేయకుండా కొరకరాని కొయ్యగా మారారనే చర్చ నడుస్తోంది.

కాళేశ్వరం కమిషన్ నోటీసులు

- చర్యల నేపథ్యంలో చర్చనీయాంశమవుతున్న విజిలెన్స్ నివేదిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో: కాళేశ్వరం న్యాయ కమిషన్ ఇస్తున్న నోటీసులతోపాటు సర్కారు తీసుకుంటున్న చర్యలతో విజిలెన్స్ కమిషన్ నివేదిక మరోసారి చర్చనీయాంశమవుతున్నది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో చోటుచేసుకున్న పగుళ్లు, సీపేజీలపై రాష్ట్ర ప్రభుత్వం తొలుత విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అప్పట్లో బ్యారేజీల నిర్మాణంలో భాగస్వాములైన ఉన్నతాధికారులు, ఇంజనీర్లపై క్రిమినల్ కేసులతోపాటు భారీ జరిమానాలు విధించాలని విజిలెన్ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. రూ. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంలో అవకతవకలకు కారణమైనవారిలో 17 మంది ఉన్నతాధికారులు, 33 కింది స్థాయి ఇంజనీర్లు, సిబ్బంది ఉన్నారు. వీరందరిపై క్రిమినల్ ప్రొసిడింగ్స్ చేపట్టడంతోపాటు శాఖాపరంగా ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జెస్ కింద విచారణ చేపట్టి శిక్షించాలని విజిలెన్స్ కోరింది. ఇప్పటికే ఉన్నతాధికారులతో ఏడుగురు రిటైరయ్యారు. అందులో మాజీ ఇఎన్‌సి జనరల్ సిహెచ్ మురళీధర్, కాళేశ్వరం మాజీ ఇఎన్‌సి నల్లా వెంకటేశ్వర్లు, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ గజ్జెల హరిహరా చారి, క్వాలిటీ కంట్రోల్ సిఇ బి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ లేక్స్, వాటర్ బాడీల ఎస్‌ఈ చాట్ల గంగాధర్, సంగారెడ్డి మాజీ సిఇబి అజేయకుమార్, సీడీఎస్ మాజీ ఇఎన్‌సి ఎ నరేందర్‌రెడ్డి ఉన్నారు. వారితోపాటు మిగతా 33 మంది అధికారులపై కఠిన చర్యలకు విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేసింది. తాజాగా సంగారెడ్డి సిఇ కె ధర్మ ఆయా పోస్టులను తప్పిస్తూ నీటిపారుదల శాఖ ఆదేశాలు ఇచ్చిన తరుణంలో మరోసారి విజిలెన్స్ నివేదిక నీటిపారుదల శాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశమవుతున్నది. కమిషన్ మేడిగడ్డ నిర్మాణ కాంట్రాక్టర్ అయిన ఎల్ అండ్ టీ సంస్థపైనా చర్చలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు విఫలమైన నేపథ్యంలో ఆ ఖర్చును సంబంధిత నిర్మాణ సంస్థను నుంచి రికవరీ చేయాలని సూచించింది. ఒప్పందంలోని అంశాలు అన్ని సక్రమంగా అమలు చేశారా ? లేదా ? పరిశీలించి చర్యలు తీసుకోవాలని చెప్పింది. అంచనాలకు సంబంధించిన మార్గదర్శకాలను మరోసారి క్రాస్‌చెక్ చేయాలని సిఫారసు చేసింది.

నీటిపారుదల శాఖ సిఇ ధర్మ పై వేటు

అవినీతికి పాల్పడ్డారనే అరోపణలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
అవినీతి హద్దులు దాటడంతో సర్కారు కన్నెర్రజేసింది. అధికారులపై తీవ్ర చర్యలకు పూనుకుంది. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న రాష్ట్ర నీటిపారుదల శాఖ సంగారెడ్డి సీఈ కె ధర్మపై ప్రభుత్వం వేటు వేసింది. ఇటు కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు హైదరాబాద్ ఇన్‌ఛార్జి సిఇగా కాసులకు ఆశపడి చెరువుల్లో అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులిచ్చినందుకుగాను సంగారెడ్డి సిఇతో పాటు హైదరాబాద్ ఇన్‌ఛార్జి సిఇ (ఎఫ్ఎసి) పోస్టునూ పీకేసింది. అంతేగాక సిఇ ధర్మను ఏకంగా నీటిపారుదల శాఖ రాష్ట్ర కార్యాయలంలోని ఇంజనీర్ ఇన్ ఛీఫ్ (జనరల్) జి అనిల్‌కుమార్‌కు అటాచ్‌చేసింది. సిఇ ధర్మపై శాఖాపరమైన విచారణ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనంతరం ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారని జలసౌధలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఏకంగా ధర్మ నిర్వహిస్తున్న రెండు సిఇ పోస్టుల నుంచి తొలగించడంతో జలసౌధలో అధికారులు, ఇంజనీర్లల్లో గుబులు ప్రారంభమైంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణాల్లో సర్వీసు నుంచి తొలగింపబడిన మాజీ సిఇ నల్లా వెంకటేశ్వర్లు, సస్పెన్షన్‌కు గురైన మాజీ ఇఎన్‌సి హరిరాంతోపాటు సివి ధర్మ కూడా కీలకపాత్ర పోషించినట్టు సమాచారం. వర్కింగ్ ఏజెన్సీలు (కాంట్రాక్టర్లు)తో సంప్రదింపులు, ప్లానింగ్, డిజైనింగ్, సాంకేతిక అంశాల విషయాల్లో సిఇ ధర్మ జోక్యం ఉందని సమాచారం. వీటన్నింటిపై సర్కారు ఇతమిద్ధంగా నిర్ధారణకు రానప్పటికి, శాఖాపరమైన విచారణ చేపట్టి ధర్మను పూర్తిస్థాయిలో సర్వీసు నుంచి తొలగించే పరిస్థితులు ఉన్నాయని జలసౌధలో ఇంజనీర్ల మధ్య మాటామంతి నడుస్తున్నది. హైదరాబాద్‌లో ఇన్‌ఛార్జి సిఇ (ఎఫ్ఎసి)గా ఉంటూ ధర్మ చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి. పలు నిర్మాణాల్లో అనుమతులు ఇవ్వడానికి కోట్లల్లో డబ్బులు పిండుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. నగర శివారుల్లోని బాచుపల్లిలోని ఒక మాల్ నిర్మాణానికి ఎన్ఒసి జారీచేయడానికి రూ. 1.5 కోట్లను వసూలు చేసినట్టు ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను ఇప్పటికే నీటిపారుదల శాఖ సేకరించిందని తెలిసింది. ఈ నేపథ్యంలో సిఇ ధర్మను ఇఎన్‌సి జనరల్‌కు అటాచ్ చేస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా సోమవారం ఉత్తర్వుల జారీచేశారు.

11న కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్

- అల్లుడి తర్వాతే మామ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
కాళేశ్వరం న్యాయ కమిషన్ విచారణను ధీటుగా ఎదుర్కోవాలని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించుకున్నారు. అందుకు సన్నద్ధమవుతున్నారు. న్యాయ కమిషన్ ఛైర్మన్ పిసి ఘోష్ ఈ నెల ఐదును విచారణకు హాజరుకావలంటూ కెసిఆర్‌కు వారం రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. అయితే వచ్చే ఐదవ తేదీ కాకుండా 11న వస్తానని, అదనపు సమయం కావాలంటూ కెసిఆర్ చేసిన విజ్ఞప్తికి కమిషన్ అంగీకరించింది. దీంతో కమిషన్ నోటీసులను గౌరవించాలని కెసిఆర్ భావించినట్టయింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలుమార్లు పార్టీ నాయకులతో అంతర్గతంగా మంతనాలు జరిపారు. ప్రధానంగా కాళేశ్వరం నిర్మాణ సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న అల్లుడు తన్నీరు హరీశ్‌రావు, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కుమారుడైన కె తారకరామారవుతోనూ ఒక దఫా చర్చించారు. అలాగే న్యాయవాదులు, ఇతర నీటిపారుదలరంగ నిపుణులతో ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో చర్చలు సాగుతున్నట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిన నాటి నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు కెసిఆర్ కనుసన్నల్లో జరిగిన విషయం విదితమే. ఇప్పుడదే ఆయనకు తలనొప్పిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు ప్రాంతం, డిజైన్లు, సాంకేతిక అంశాలు, నిర్మాణం, నిధులు తదితర విషయాల్లో ఇంజనీర్ల సలహాలు, సూచనలు కాకుండా తాను అనుకుందే ఆచరణలో చేసి చూపించారనే ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ ప్రాంతాల్లో భూసారపరీక్షలు చేయకుండా నిర్మించారని, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)లో నిర్ణయించినవిధంగా కాకుండా మరో చోట బ్యారేజీలను నిర్మించారనేది విజిలెన్స్ కమిషన్ తేల్చింది. నీళ్లున్న ఓట్ల కాకుండా మరో చోట ప్రాజెక్టును ప్రతిపాదించారనేది ఇంకో ఆరోపణ. వీటన్నింటిపై ఇప్పటికే పిసి ఘోష్ విచారణ జరిపింది. ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, ఇతర నిపుణులతో మాట్లాడింది. ఎవిడెన్స్ కింద అఫిడవిట్లు తీసుకుంది. కాళేశ్వరం ఫైళ్లన్నింటిని తెప్పించుకుని అధ్యయనం చేసింది. విచారణ దాదాపు పూర్తికావచ్చింది. ప్రజాప్రతినిధులను మాత్రం విచారించాల్సిన అవసరం లేదని తొలుత భావించిన కమిషన్, ఆనక వారికీ నోటీసులు ఇచ్చింది. జూన్ 30 నాటికి విచారణను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలనే సంకల్పంతో కమిషన్ పనిచేస్తోంది. ఈ తరుణంలో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ఈ నెల 11న కేసీఆర్ కమిషన్ ముందుకు రానున్న నేపథ్యంలో ఆయన ప్రాజెక్టుపై అవగాహన చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. బిఆర్‌ఎస్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టు ఉద్దేశం, లక్ష్యం, ఇతర అంశాలను కమిషన్ దృష్టికి తెవాలని భావిస్తున్నారు.

డిజైన్లు, సాంకేతిక అంశాలు, భూసార పరీక్షలు తదితర విషయాలు నీటిపారుదల శాఖకు సంబంధించినవిగా చెప్పే అవకాశాలు ఉన్నాయని బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాగా కెసిఆర్‌కు ముందే మాజీ మంత్రి హరీష్‌రావు కమిషన్ ఎదుటకు రానున్నారు. హరీష్ సైతం న్యాయవాదులు, మాజీ అధికారులు, నిపుణులతో ఇప్పటికే చర్చలు జరిపారు. దీనిపై మీడియాకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే దాన్ని వాయిదా వేశారు. విచారణకు ముందు ప్రజెంటేషన్ ఇస్తారా? తర్వాత ఇస్తారా? అనే అంశం తేలాల్సి ఉంది. అయితే అనుమతి ఇస్తే కమిషన్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం ద్వారా తన వాదనలను బలంగా వినిపించాలని హరీష్ భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే అయా అధికారులు, ఇతరులను కమషన్ అడిగిన ప్రశ్నలను ఇటు కెసిఆర్, అటు హరీష్ అధ్యయనం చేస్తున్నట్టు తెలిసింది.

రేకుల ఇంటికి రూ.9073 కరెంట్ బిల్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మెదక్ జిల్లా చేగుంట మండలం సిఎంఆర్ కాలనీలో ఉంటున్న నూతన కంటి అరుణ రేకుల ఇంటికి మే నెల రూ.9073 కరెంట్ బిల్లు వచ్చింది. దాంతో అరుణ ఉక్కిరిబిక్కిరై ఆందోళన చెందుతుంది. మండల కేంద్రంలో సోమవారం ఆమె విలేకరులను ఆశ్రయించి తన గోడును వెళ్లబోసుకుంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. సిఎంఆర్ కాలనీలో తనకు రేకుల ఇల్లు ఉందని, సర్వీస్ నెంబర్. 22004660 గల మీటర్‌కు కొన్ని నెలలు జీరో బిల్లు వస్తుందని తెలిపారు. కాగా, మే 5వ తేదీన రూ.9073ల విద్యుత్ బిల్లు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమైతే తమకు ఇంత బిల్లు రావడం ఆందోళనకు గురి చేస్తుందన్నారు. స్థానిక కరెంటు లైన్ మెన్‌ను ఇంత బిల్లు ఎలా వచ్చిందని అడిగితే ప్రతిసారి తన ఇంటికి వచ్చి బిల్లు కట్టకుంటే కరెంటును తొలగిస్తానని బెదిరిస్తున్నాడని వాపోయారు. అధికారులు జోక్యం చేసుకుని తక్షణమే తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై విద్యుత్ ఎఇ వంశీని ఫోన్‌లో వివరణ కోరగా.. లెటర్ పెడతానని, తప్పకుండా బిల్లు తగ్గేలా చూస్తానని తెలిపారు. ఒక్కోసారి మీటర్ల దగ్గర ఉన్న వైరు సమస్య అయి కూడా ఉంటుందని, పరీక్షించి ఆమెకు న్యాయం చేస్తామని అన్నారు.

రైలు ఢీ కొని అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో ఇద్దరు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన హైదరాబాద్ సమీపంలోని కాచీగూడ రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. మహ్మద్ సాహెబుద్దీన్ (26), ఫైజాన్ (21) యాకుత్‌పురా-ఉప్పుగూడ స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా అటువైపుగా వచ్చిన రైలు ఢీ కొట్టింది. దీంతో వారిద్దరూ అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. సాహెబుద్దీన్ ఎలక్ట్రిక్ పనులు చేయగా, ఫైజాన్ వెల్డింగ్ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాళ్లు. చేతికందిన కొడుకులు మృత్యువాత పడటంతో తండ్రి కమాల్ విలపిస్తున్న తీరు అక్కడున్న వారి గుండెల్ని మెలిపెట్టింది.

షాప్సీ సీజన్ ముగింపు సేల్‌లో 50 శాతం తగ్గింపు

బెంగళూరు : ఇ-కామర్స్ వేదిక షాప్సీ సీజన్ ముగింపు సేల్‌లో ప్రత్యేక డిస్కౌంట్‌లు అందిస్తున్నట్లు తెలిపింది. కోటి పైగా ఉత్పత్తులను విక్రయానికి ఉంచినట్లు ఆ సంస్థ పేర్కొంది. జూన్ 8 వరకు జరిగే ఈ సేల్‌లో ప్రతీ రోజు 50 శాతం వరకు తగ్గింపు ఆఫర్లను ప్రకటించింది.

మహీంద్రా థార్ రోక్స్‌లో ఇక డాల్బీ అటమ్స్ ఆడియో

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన థార్ రోక్స్‌లో ఇక 4 ఛానల్ డాల్బీ ఆటమ్స్ ఆడియో సిస్టమ్ అందుబాటులోకి వచ్చింది. ఈ టెక్నాలజీని వాడుకున్న తొలి ఎస్‌యువిగా నిలిచింది. ఈ ఫీచర్ తొలుత టాప్ ఎండ్ ఎఎక్స్7ఎల్ వేరియంట్‌లో అందించడానికి మహీంద్రాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు డాల్బీ లాబరేటరీస్ తెలిపింది.

తప్పులు చేసింది మీరు... రాహుల్‌గాంధీపై నిందలా?

- మాజీ ఎమ్మెల్యే జగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఉగ్రవాదులు భారతీయులపై దాడి చేసి 26 మందిని పొట్టనపెట్టుకుంటే, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు వారిని పట్టుకోలేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. ఉగ్రవాదులను పట్టుకోవడంలో విఫలమైన బిజెపి సర్కారు... రాహుల్ గాంధీపైనా నిందలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేదో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పార్లమెంటులో ప్రశ్నిస్తారని, కచ్చితంగా బిజెపి సర్కారు సమాధానం చెప్పి తీరాల్సిందేనన్నారు. రాహుల్ ప్రశ్నిస్తే ఆయనపై నిందలా? అమెరికా అధ్యక్షులు ట్రంప్ దేశ అంతర్గత విషయంలో జోక్యం చేసుకోవచ్చా? అని ప్రశ్నించారు. పాకిస్తాన్‌ను అడ్డం పెట్టుకుని బిజెపి రాజకీయాలు చేయడం సరైందేనా? పాకిస్తాన్ ప్రధాని ఇంటికి వెళ్ళింది మోడీ కాదా? దీనికి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి మంత్రులారా? ఇప్పటివరకు పాకిస్తాన్‌కు రాహుల్ గాంధీ వెళ్ళలేదని గుర్తు చేశారు.

స్టోన్‌క్రాఫ్ట్ 'వుడ్స్ శంషాబాద్' విస్తరణ

హైదరాబాద్ : ఈకోఫ్రెండ్లీ రియాల్టీ సంస్థ స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ తన 'వుడ్స్ శంషాబాద్' ప్రాజెక్టును విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు రెండో దశను ప్రారంభించడం ద్వారా ద్వారా రూ.300 కోట్ల ఆదాయం సమకూరుతుందని కంపెనీ అంచనా వేసింది. ఈ దశలో 100 పైగా ఎకరాల్లో 150 ఫామ్ యూనిట్లను అందుబాటులోకి తేనున్నామని స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ ఫౌండర్, సిఇఒ కీర్తి చిలుకూరి పేర్కొన్నారు. ప్రతి యూనిట్ 1,800 నుండి 3,500 చదరపు గజాల పరిమాణంలో ఉంటుందన్నారు. ఇది ప్రశాంతత, సముదాయ జీవనశైలి, పచ్చదనానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. గత మూడేళ్లుగా తొలి దశలో ఇప్పటికే 4,50,000 చెట్లు, మొక్కలతో స్వయం సమృద్ధి సాధించామన్నారు. ఫేజ్ 2తో స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ 100 ఎకరాల్లో దీన్ని విస్తరించాలని యోచిస్తోందన్నారు.

'గీతం' పరిశోధక విద్యార్థి హరీశ్ కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇఇసిఇ విభాగం పరిశోధక విద్యార్థి జి.హరీశ్ కుమార్ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. బహుళ-ఇన్‌పుట్, బహుళ-అవుట్ పుట్ (ఎంఐఎంఒ-ఒఎఫ్‌డిఎం) పూర్తి రూపం కోసం హైబ్రిడ్ ఫ్రూట్ ఫ్లై-ఆధారిత సాల్ప్ స్వార్మ్ ఆప్టిమైజేషన్ (హెచ్ఎఫ్ఎఫ్-ఎస్ఎస్ఒ) అల్గోరిథం ఉపయోగించి బహుళ-లక్ష్య సింగిల్-ఛానల్ ఆప్టిమైజేషన్‌'పై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఇఇసిఇ ప్రొఫెసర్ పి.త్రినాథరావు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ హరీశ్ పరిశోధన.. శక్తి సామర్థ్యం, డేటా విశ్వసనీయతను పెంచడం ద్వారా వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థలను ఆప్టిమైజ్ చేయడానికి ఒక కొత్త పరిష్కారాన్ని అందిస్తున్నదని తెలిపారు. అంతేగాక, స్థిరమైన మొబైల్ నెట్‌వర్క్‌లకు పెరుగుతున్న డిమాండ్లను పరిష్కరించే ఒక వినూత్న హైబ్రిడ్ అల్గోరిథంను పరిచయం చేస్తుందని తెలిపారు. డాక్టర్ హరీశ్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పిహెచ్‌డి పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ విఆర్ శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ సీతారామయ్య, ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ టి మాధవి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఆయన్ను అభినందించారు.

కవులు, కళాకారుల కృషి వల్లే ప్రత్యేక తెలంగాణ కల సాకారమైంది..

- సిరికొండ మధుసూదనాచారి

ప్రజాశక్తి కల్చరల్: కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తల కృషి ఫలితంగా, ప్రత్యేక కళ సాకారమైందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గానసభ అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని, వారి త్యాగ ఫలితాలను అందిపుచ్చుకొని ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఎంవి రఘువీర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం జరిగింది.

రైతులకు పరిహారం చెల్లించడంలో అలసత్వమా?

- జూమ్ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి సీరియస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
నకిలీ మొక్కజొన్న విత్తనాలతో పంట నష్టపోయిన ములుగు రైతులకు పరిహారం చెల్లించడంలో ఇంత అలసత్వమా? అంటూ రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కంపెనీల ప్రతినిధులపై సీరియస్ అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్ నుంచి ఆయన జూమ్ సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ విత్తన కంపెనీల వ్యవహారంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ములుగు జిల్లాలో విత్తనోత్పత్తి ఘటనలో ఇప్పటి వరకు జరిగిన పురోగతిపై ఆయన సమీక్షించారు. ఇప్పటి వరకు జరిగిన పరిహారం పురోగతిపై ములుగు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పొరేషన్ ఛైర్మెన్ అన్వేష్‌రెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్ర మిశ్రా, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ కేశవులు, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, దొంతి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
పదే పదే కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేస్తున్న బిఆర్‌ఎస్ నేతలు... పదేళ్ల మీ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. బిఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ భూములను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించిన మాట నిజం కాదా? అని హరీశ్‌రావును ప్రశ్నించారు. కంచె చేను మేసినట్లు ప్రభుత్వ ఆస్తులను నాశనం చేశారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. హరీశ్‌రావు, ఈటల రాజేందర్ భేటీపై తనకు పక్కా సమాచారముందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్ని రంగాల్లో రోల్ మోడల్ అని తెలిపారు. కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కెసిఆర్ కలల ప్రాజెక్టు 'కాళేశ్వరం కాస్త కులేశ్వరం అయింది' అని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో హరీశ్‌రావుకు బిఆర్‌ఎస్ బీఫామ్ వస్తుందా? ఏ పార్టీ నుంచి పోటీ చేస్తావో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్, బిజెపి పొత్తు ఉంటుందంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలకు హరీశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఆయన గన్‌పార్క్ వద్ద అమర వీరులకు నివాళులర్పించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. వారి ఆదర్శాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు.

బిజెపి గుర్తించని నేత ఈటల

- ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎంపి ఈటల రాజేందర్‌ను సొంత పార్టీ బిజెపి గుర్తించడం లేదని కాంగ్రెస్ ఎంపి ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. ఆయన బిజెపి అధ్యక్ష పదవి కోసం వామపక్ష భావాలాన్ని వదిలి మతోన్మాద భావజాలం ఉన్న ఆ పార్టీలోకి పోయారని విమర్శించారు. ఆ పదవి రాకపోయే సరికి ఆయన ఫ్రస్టేషన్‌లో మహేష్‌కుమార్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటి లోపల ఈటల రాజేందర్‌రెడ్డి గేట్ బయటకు రాగానే ఒబిసి నాయకుడిని అని చెబుకుంటారని ఎద్దేవా చేశారు. మిస్ మ్యాగీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్న హరీశ్‌రావు... అందుకు సంబంధించిన ఫుటేజ్ బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మాకు ఎవరితోనూ పొత్తుండదు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఆర్‌ఎస్‌కు ఏ పార్టీతోనూ పొత్తుండబోదని బిఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...ఇప్పటికిప్పుడు శాసనసభకు ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్ వంద సీట్లతో అధికారంలోకి వస్తుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కచ్చితంగా మళ్లీ సీఎం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మహిళలకు వడ్డీలేని రుణాల కింద రూ.21 వేల కోట్లను పంపిణీ చేసినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అలా చేసినట్టు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ సవాల్ విసిరారు. తెలంగాణకు అన్యాయం చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లయినా సరే.. దాని నిర్మాణాన్ని అడ్డుకుని తీరతామని హెచ్చరించారు.